మధుకర్ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది.

మరేం మాట్లాడలేదు మధుకర్. పత్రికలోని ఆ పేజీవేపు చూస్తూ వుండిపోయాడు.

సడన్‌గా మధుకర్ కళ్ళు- యాడ్ ఇండియా న్యూస్ ఐటమ్‌కి కుడిపక్క వున్న చిన్న బాక్స్ మీద పడ్డాయి.

టెక్స్‌టైల్ ఇండస్ట్రీలో పెనుతరంగంలా వచ్చిన జెన్నీ ఫాబ్రిక్స్ సూపర్‌హిట్‌కి వెనకనున్న వ్యక్తెవరు? జెన్నీ ఫాబ్రిక్స్‌కి హీరో నాగార్జున మోడల్ అయిన వింతకథ? వచ్చే సంచికలో--

“జెన్నీ డ్రెస్ మెటీరియల్ ఒక్క ఇరవైరోజుల టైమ్‌లోనే ఆరుకోట్ల బిజినెస్ చేసిందట. నిజమేనా సార్?” ఆరోజు ఉదయాన్నే న్యూస్ పేపర్లో చూసిన న్యూస్ అయిటెమ్ జ్ఞాపకం రాగా అడిగాడు మధుకర్.

“ఎస్! ఇటీజ్ ట్రూ. ఆ కంపెనీ వెనకున్నది ఎవరనుకున్నావ్? డైనమిక్ యంగ్ లేడీ ..... నీలాంటి క్రియేటివ్ జీనియస్సే. ఆ అమ్మాయి మనాఫీసు కొచ్చింది. వాటే కమాండింగ్ కారెక్టర్! నెక్ట్స్ యాడ్ కాంపైన్ కూడా మనకే ఇస్తానని ప్రామిస్ చేసింది ఆ అమ్మాయి. జెన్నీ ఫాబ్రిక్స్ ఆ అమ్మాయి పార్ట్‌నర్ అనుకుంటాను.”

“ఎవరా అమ్మాయి?” ఆసక్తిగా అడిగాడు మధుకర్.

“ఆ అమ్మాయి పేరా .....” పేరు చెప్పబోయి-ఇంతలో ఫోన్ రింగ్ కావడంతో చటుక్కున ఫోనెత్తాడు సుమదేవ్.

ఫోన్‌లో అవతలినుంచి మాట్లాడుతున్న వ్యక్తి రాఘవేంద్ర నాయుడు. వాళ్ళిద్దరూ పదిహేను నిమిషాలసేపు మాట్లాడుకున్నారు. ఎంతకీ ఆ టాపిక్ తరగకపోవడంతో లేచి తన ఛాంబర్‌లో కొచ్చేశాడు మధుకర్. మర్నాడు సుమదేవ్, మధుకర్ బొంబాయి వెళ్ళారు.

* * * *

THE INSTITUTION OF ENGINEERS (INDIA)
Andhra pradesh State Centre,
Visveshwarayya Bhavan, Khairathabad-Hyd-4.

ఫ్రమ్ ఎడ్రస్ ఒకసారి చూసి కవరు విప్పింది మహతి.

Seventh National Convention of Textile Engineers సందర్భంగా "Textile Industry-Beyond 2000 AD" అన్న విషయమ్మీద జరిగే సెమినార్లో పాల్గొనమని వచ్చిన ఆహ్వానం అది.

టెక్స్‌టైల్ ఇండస్ట్రీలోని ప్రముఖులు పాల్గొని, టెక్స్‌టైల్స్‌కు సంబంధించి పాత, కొత్త పద్ధతుల గురించి చర్చించే అరుదైన సమావేశంలో పాల్గొనమంటూ తనకు వచ్చిన ఆ ఆహ్వానం చూసి ఉక్కిరిబిక్కిరైపోయింది మహతి.

ఆ ఆనందాన్ని పంచుకోడానికి రఘురామశెట్టిగానీ, కళ్యాణిగానీ, వనజాక్షిగానీ ఎవరూ దగ్గరలేరు.

ఆలోచిస్తూ కూర్చుండిపోయింది.

అప్రయత్నంగా ఆరోజు వచ్చిన లెటర్స్ అన్నిటినీ తిప్పి చూస్తోంది.

అందులో ఒకటి-- నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ న్యూఢిల్లీ నుంచి వచ్చిన లెటర్ గబగబా కవరిప్పి చదవడం మొదలుపెట్టింది.

రెస్పెక్టడ్ సర్/ మేడమ్.

నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ గురించి మీకు తెలిసే వుంటుంది. ఆ కార్పొరేషన్ ఎక్స్‌పోర్ట్ డివిజన్ ఛైర్మన్ ఆదేశాల మేరకు మీ కంపెనీకి ఈ ఉత్తరం రాయడమైనది.

ఇటీవల జెన్నీ ఫాబ్రిక్స్ తరుపున మీరు మార్కెట్లో ప్రవేశపెట్టిన జన్నీ డ్రెస్ మెటీరియల్స్‌ని మా కార్పొరేషన్‌కు సరఫరా విషయమై ఛైర్మన్‌గారు మీతో

మాట్లాడాలనుకుంటున్నారు. ఆ విషయమై మీ కంపెనీకి చెందిన వ్యక్తిని (మీకు సరుకు సరఫరా విషయంలో ఆసక్తి వున్న ఎడల ) ఈ ఉత్తరం అందిన వారం రోజుల్లో న్యూఢిల్లీలోని కార్యాలయానికి పంపగలరని  మనవి. వచ్చేముందు మీరు మాకు లేఖద్వారా లేక ఫోన్ ద్వారా తెలియపరచిన ఎడల మీ కంపెనీ ప్రతినిధిని రిసీవ్ చేసికొనగలము.''

ఎన్.టి.సి. ఎక్స్‌పోర్ట్ డివిజన్ ఛైర్మన్ తరుపున ఎలాంటి విషయాన్నయినా, ఎంతగా ఫీలింగ్ లేకుండా అంటీ ముట్టనట్టుగా రాయగలరో చూసి, మనసులోనే నవ్వుకుంది మహతి.

ఎన్.టి.సి. ఆఫర్- ఎవరు వెళ్తారు? తనే వెళ్ళాలి తప్పదు. రోజు రోజుకీ తనమీద వత్తిడి పెరగడం, మానసికంగా, శారీరకంగా తను అలసిపోవడం ..... గుర్తిస్తూనే వుంది మహతి.

ఇంకా ఎన్నాళ్ళిలా .....

ఇంకా రెండు నెలలు ..... ఆ తర్వాత .....

ఆ తర్వాత అన్నదానికి జవాబు దొరకలేదు మహతికి.

మర్నాడు-

భువనగిరినుంచి వచ్చాడు రఘురామశెట్టి. ఎన్.టి.సి. నుంచి లెటర్ విషయమై ఆయనతో మాట్లాడింది.

"చూడమ్మా మహతీ ..... ఏ ముహూర్తంలో నిన్ను చూశానో తెలీదు ..... నా కష్టాలన్నీ తీరిపోయాయి. నువ్వు తలచుకుంటే దీనిని కొన్ని కోట్లు టర్నోవర్ జరిగే పెద్ద సంస్థగా చెయ్యగలవు. నాకు ఓపిక లేదు ..... నువ్వు వేరే విధంగా అనుకోవద్దు ..... నాకు ఇష్టంలేక మాత్రం చెప్పడంలేదు. నువ్వు ఇరవై నాలుగు గంటలూ పడుతున్న శ్రమని చూసి ..... "

ఏదో చెప్పబోయాడాయన.

“నా శ్రమ గురించి బాధపడడం మానెయ్యమని చాలాసార్లు చెప్పాను మీకు ..... మనకు పది రూపాయలే అవసరమని, ఆ పది రూపాయల కోసం నానా బాధలుపడి సంపాదించాక, చాల్లే అని అనుకోవడం మూర్ఖత్వమని నా అభిప్రాయం ..... ఇంతకు పూర్వం జెన్నీ క్లాత్‌ని తయారు చేసినపుడు, మీ ఒక్కరికోసమే మీరు ప్రారంభించలేదు ..... అలాగే ఇప్పుడు కూడా ..... కొన్నివేల కుటుంబాలకు కలకాలం ఉపాధి నిచ్చే మహా సంస్థ మన జెన్నీ సంస్థను తీర్చిదిద్దాలని నా లక్ష్యం ..... అంతే ..... ”

మహతి మనసులోని అసలైన నిస్వార్థలక్ష్యానికి రఘురామశెట్టి కళ్ళు చెమర్చాయి.

“గురువారం ఫ్లయిట్‌కి ఢిల్లీకి టికెట్ తెప్పించండి ..... ” చెప్పింది మహతి.

“అలాగేనమ్మా ..... ” బయటికెళ్ళాడాయన.

* * *

గురువారం --

పి.ఎ. తో పాటు బయలుదేరడానికి సిద్ధంగా వుంది మహతి.

ఇంకా ఫ్లయిట్‌కి టైముంది- హైద్రాబాద్, భువనగిరిలో తను లేనప్పుడు చేయాల్సిన పనులు, డీలర్స్ ఫోన్స్‌చేస్తే మాట్లాడాల్సిన విషయాలు అన్నీ చెపుతోంది మహతి.

పనిలో పనిగా తను ఢిల్లీ వెళుతున్న విషయం హేమకు ఫోన్ చేసి చెప్పింది.

“మరీ హైరానా పడిపోకు. హెల్త్ జాగ్రత్త ..... ఎన్ని రోజులుంటావ్ ..... ”

“మాగ్జిమమ్ టు డేస్ ..... వచ్చాక కలుస్తాను ..... ” ఫోన్ పెట్టేసింది మహతి.

ఒక అరగంట తర్వాత ఆఫీసునుంచి కారులో బయలుదేరింది మహతి. పక్కన రఘురామశెట్టి ముందు సీట్లో పి.ఎ. కూర్చున్నాడు.

కారు ఖైరతాబాద్ ఓవర్‌బ్రిడ్జ్ దగ్గర మలుపు తిరుగుతున్న సమయంలో--

అకస్మాత్తుగా మహతి చూపులు. రోడ్డుకి ఎడం పక్కనున్న ఓ బ్యాంకు బోర్డుమీద పడ్డాయి.

వెంటనే ఆమె కళ్ళు చేతి వాచీలోని డేట్ కోసం వెతికాయి.

ఆ రోజు 1 వ తేదీ.

సరిగ్గా వారంరోజుల క్రితం అనుకుంది బ్యాంకులో డబ్బు జమచేయాలని, కమీషన్‌గా తన కొచ్చిన అయిదు లక్షల రూపాయల్ని, తన రూంలో బీరువాలో చెక్ రూపంలో వుంచింది.

ఇప్పుడెలా ..... ?

ఫ్లయిట్‌కి గంటంబావు మాత్రమే టైముంది రఘురామశెట్టికి తన రూం తాళాలిచ్చి, ఆ చెక్స్‌ని బ్యాంకులో డిపాజిట్ చెయ్యమని చెప్తే- ఆ విషయం మరొకరికి తెలియగూడదు.

ఎలా .....

మరొక్క క్షణం ఆలస్యం చెయ్యలేదు మహతి.

"డ్రైవర్ ..... అర్జంట్‌గా కారు వెనక్కి తిప్పు ..... నా రూంకి పోనీ."

"ఏమ్మా, ఏమైనా మర్చిపోయావా ..... " రఘురామశెట్టి అడిగిన ప్రశ్నకు జవాబు చెప్పలేదు మహతి.

గాభరాగా చేతి వాచీవేపు చూస్తోంది.

కారు వెనక్కి మళ్ళింది. ఇరవై నిమిషాలు ..... కారు రూం ముందు ఆగింది. గబుక్కున కార్లోంచి దూకి, రూం తాళాలు తీసి, బీరువాలోంచి సూట్‌కేసు తీసుకుని మళ్ళీ రూంకి తాళాలువేసి కార్లోకొచ్చి పడింది.

“డ్రైవర్ ..... మెహదీపట్నం పోనీ.”

“మేడమ్ ..... ” ఏదో అడగబోయాడు పి.ఏ. మహతి ముఖంలో కనిపించిన సీరియస్‌ని చూసి భయపడ్డాడు.

రఘురామశెట్టికి కూడా ఏం అర్థం కావడం లేదు.

మరో ఇరవై ఐదు నిమిషాలకు కారు మెహదీపట్నం స్టేట్ బ్యాంక్ ముందు ఆగింది.

మరుక్షణం అందులోంచి దుమికింది సూట్‌కేసుతో. సుడిగాలిలా విసురుగా లోనికి ప్రవేశించింది.

పరుగెట్టి లోనికొచ్చిన మహతివేపు అయోమయంగా చూశాడు బ్రాంచ్ మేనేజర్.

“ఇందులో ఫైవ్‌లాక్స్‌కి చెక్స్ వున్నాయి ..... డిపాజిట్ చెయ్యండి. మళ్ళీ కలుస్తాను” అంటూ ఒక కవర్‌ని టేబిల్‌మీద పెట్టి అంతే వేగంతో వెనుతిరిగి, మెయిన్ గేటువరకు వచ్చి, ఏదో జ్ఞాపకంవచ్చి-- మళ్ళీ బ్యాంకు మానేజర్ దగ్గరకెళ్ళి--

“ఇవాళ మధుకర్ వచ్చారా ..... ” అని అడిగింది.

“రాలేదు మేడమ్ ..... ”

ఆ రోజు వచ్చిన పోస్టుని పక్కకుతోస్తూ, మహతి టేబిల్‌మీద పెట్టిన కవర్‌ని ముందుకు జరుపుకుంటూ అన్నాడు బ్రాంచ్ మేనేజర్.

మహతి పెదవుల మీద చిరునవ్వు కదలాడింది.

“థాంక్స్ ..... ”

గబగబా వెనక్కొచ్చింది. అప్పుడామెకు సంతృప్తిగా ఉంది.

కానీ-- అప్పటికి ఫ్లయిట్ బయలుదేరడానికి సరిగ్గా ..... సరిగ్గా ..... ముప్పై నిమిషాలు  మాత్రమే సమయముంది.

*                    *                    *                    *

మహతి తెచ్చిన కవర్ తెరచి, చెక్స్ చూసి, మహతి ఎకౌంట్‌పనిని ఒక క్లర్కుకు అప్పగించి, ఆ రోజు వచ్చిన పోస్టులో తన పేరున ఉన్న ఒక కవర్ని విప్పి చూసాడు.

అందులో ఒక చెక్ ఉంది.

ఆ చెక్ మధుకర్ పంపింది.

ఆ చెక్ విలువ మూడు లక్షలు రూపాయలు!

ఎయిర్‌పోర్ట్ అధికారులంతా కాలుగాలిన పిల్లుల్లా తిరుగుతున్నారు.

దానిక్కారణం ..... అదే ఫ్లయిట్‌లో విమానయాన శాఖ మంత్రి కూడా ఉన్నారు.

పరుగు, పరుగున వచ్చిన మహతిని చూసి, ఏమీ అనలేక నోట్లోనే గొణుక్కున్నారు అధికారులు.

ఫ్లయిట్‌లో ఉన్న మొత్తం ప్రయాణీకులందరూ, లోనకి వస్తున్న మహతినే చూస్తున్నారు. మహతి తలవంచుకుని వెళ్ళి, ఆమె సీటులో కూర్చుంది. ఆ పక్కనే పి.ఏ. కూర్చున్నాడు.

అక్కడికి కొంచెం దూరంలో --

రాఘవేంద్ర నాయుడు కూర్చున్నాడు.

రాఘవేంద్ర నాయుడు లోనకొస్తున్న మహతిని చూసి ఆశ్చర్యపోలేదు.

ఎందుకంటే --

ఎప్పటికప్పుడు ఆయనకు రవికిరణ్ బావమరుదులు లేటెస్ట్ విషయాలు

చెపుతున్నారు.

కానీ-

రాఘవేంద్ర నాయుడు మహతిని చూసిన వెంటనే ఆమెలోనున్న ప్రత్యేకతను గమనించాడు.

ఆ ప్రత్యేకత, ఆమె పొట్ట కొంచెం ఎత్తుగా ఉండడం .....

అంటే ..... మహతి ..... గర్భవతా ..... తనలో తాను తర్జన భర్జనలు పడుతున్నాడాయన.

మహతి అలా తొందరపడదు ..... ఎందుకలా జరిగింది? దీనికి కారణం ఎవరు? మహతి , తన కొడుకును కాకుండా ఇంకెవరినైనా ప్రేమించిందా? ఆయనకు ఎప్పుడో అరుదుగా తలనొప్పి వస్తుంది.

ప్రస్తుతం ఆయనొక్కడే, అ ఫ్లయిట్‌లో తలనొప్పితో బాధ పడుతున్నాడు.

* * * *

నీకూ, నాకూ మధ్య ఒక స్వప్నం నిద్రిస్తున్న వేళ-

నీకూ నాకూ మధ్య ఒక సత్యం కలవరపడుతున్న వేళ-

నా కనుపాపల మీద ఒక జాబిలి రేక--

మంద్రంగా మందహాసం చేస్తున్న వేళ--

రా ..... ప్రియతమా ..... సముద్రాన్ని దోసిలి పట్టి, అలల్ని కౌగిట చేర్చుకుని-- ఉక్కిరిబిక్కిరై పోదాం రా .....

దిగంతాల నిండా నిండిన నిన్నులో నన్ను నిలువుటద్దంలా చూసుకుని-- ఆకాశ అధరంతో, పుడమిని చుంబించుదాం పద..

ఈ రేయి మెత్తని, తడి ఇసుక మీద

సడి సెయ్యకుండా పడుకుంది

రేయికి కూడా కనుదోయిలాగే కలలుంటాయి. ఆ కలల వలల కనుకొసలలో, చిక్కుకుపోయిన జ్ఞాపకాలని ఒక్కొక్కటి .....

ఏరుకుంటూ--

అనంత తిమిర సంద్రంలో--

దినాంత కాంతి ప్రవాహంలో--

అటు నువ్వు ..... ఇటు  నేను .....

నీకూ నాకూ మధ్య ఒక స్వప్నం నిద్రిస్తున్న వేళ--

నీకూ నాకూ మధ్య ఒక సత్యం కలవరపడుతున్న వేళ--

ఎవరో చెవుల్లో వేణువూదినట్టయి, ఒక్కసారి మెలుకువొచ్చింది మధుకర్‌కి.

కళ్ళువిప్పి చూసాడు. పూర్తిగా తెలవారిపోయింది.

రాత్రంతా, కలత నిద్దరతో గడపడం. ఆ కలత నిద్దురలో మహతి మనోరూపం, మనోహరంగా కదలాడడం .....

ఒక్కొక్కప్పుడు అందమైన కలని, మామూలు అక్షరాల్లో విశ్లేషించుకున్నా-

కవిత్వంలా ఉంటుంది.

అలాగే ఉంది మధుకర్ మానసిక స్థితి.

చాలాసేపు ..... చాలాసేపు అచేతనంగా కూర్చుండిపోయాడు.

మహతి .....

నిశ్శబ్దంగా తన రాక్షసత్వాన్ని భరించిన మహతి.

మహతి .....

నిజమైన ప్రేమతో తనలోని మనిషిని పైకి తీసిన మహతి .....

ఇద్దరి మధ్యా లక్ష్యం అందుకోడానికి గడువు ఇంకా నెలరోజులే ఉంది.

మహతి కోసమైనా తను ఓడిపోవాలి.